# ఐఐటీ-జేఈఈ స్థాయి పెరిగింది!



**ఇటీవల జరిగిన ఐఐటీ ప్రవేశపరీక్ష ప్రమాణాల పరంగా అత్యున్నతంగా ఉంది. సబ్జెక్టు లోతులకు వెళ్ళి ప్రశ్నలను రూపొందించారు. ప్రతిభావంతులు మాత్రమే ర్యాంకులు సాధించేలాగా ప్రశ్నపత్రాల రూపకల్పన జరిగిందంటూ విశ్లేషిస్తున్నారు ఐఐటీ-జేఈఈ బోధన నిపుణుడు డి. కృష్ణమూర్తి.**

ఈ నెల 13న జరిగిన ఐఐటీ-జేఈఈ పరీక్షకు దేశవ్యాప్తంగా దాదాపు 3.20 లక్షలమంది హాజరయ్యారు. గత ఏడాదితో పోలిస్తే... ఈ సంఖ్య దాదాపు 30 శాతం పెరిగింది. స్వల్పమార్పులతో పరీక్ష మోడల్ దాదాపు గత సంవత్సరం లాగే ఉంది. కానీ ఈసారి ప్రశ్నపత్రాలు అత్యున్నత ప్రమాణాలతో ఐఐటీల స్థాయికి తగినట్టుగా రూపొందాయి.

ఐఐటీ-జేఈఈ 2007 ప్రశ్నపత్రాలు బాగా సులువుగా ఏ ప్రత్యేకతా లేకుండా రూపొందించారని విద్యావేత్తల నుంచి విమర్శలు వెలువడ్డాయి. దీంతో ఈసారి పరీక్ష స్థాయిని పెంచారు.

తాము తల్చుకుంటే ఆబ్జెక్టివ్ టైపు ప్రశ్నలను కూడా అద్భుతంగా రూపొందించగలమని ఐఐటీ ప్రొఫెసర్లు మరోసారి నిరూపించారు. జ్ఞాపకశక్తికీ, వేగానికీ కాకుండా భావనలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి సబ్జెక్టు లోతులకు వెళ్ళి ప్రశ్నలను రూపొందించారు. ఐఐటీ-జేఈఈనే లక్ష్యంగా పెట్టుకొని రెండు సంవత్సరాలు దీక్షతో సంసిద్ధులైన ప్రతిభావంతులు మాత్రమే ర్యాంకులు సాధించేలాగా ప్రశ్నపత్రాల రూపకల్పన జరిగింది. తక్కువ క్లిష్టత ఉండే ఏఐఈఈఈ, ఎంసెట్‌లకు సిద్ధమయ్యేవారికి అందనంత దూరంలో జేఈఈ నిలిచింది.

ఎక్కువమంది అభ్యర్థుల అభిప్రాయం ప్రకారం... గణితం అత్యంత కఠినంగా ఉంది. కఠినత్వం విషయంలో రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొదటి పేపర్ 246 మార్కులకూ, రెండో పేపర్ 243 మార్కులకూ ఇచ్చారు. మొత్తం కలిపి గరిష్ఠంగా 489 మార్కులు.

నిపుణుల అంచనా ప్రకారం 200 మార్కులకు పైగా సాధించిన అభ్యర్థికి ఐఐటీల్లోని ఇంజినీరింగ్ కోర్సుల్లో సీటు లభించే అవకాశం ఉంది. అలాగే 300 మార్కులపైన స్కోర్ చేయగలిగితే 100లోపు ర్యాంకు వచ్చే అవకాశం ఉంది.

పేపర్లు కష్టంగా ఉన్నా విద్యార్థులకు ఉపకరించే విధంగా ఉన్నాయి. ఉదాహరణకు... గత సంవత్సరం అభ్యర్థులు మార్కులు తెచ్చుకోవటంలో ఇబ్బంది పడిన matix-match type ప్రశ్నల్లో ఈసారి మార్కులు ఇచ్చే విధంలో మార్పులు చేయటం అభ్యర్థులకు లాభదాయకం. మొదటి ప్రశ్నపత్రంలో 3 గంటల వ్యవధిలో 69 ప్రశ్నలు, రెండో ప్రశ్నపత్రంలో 3 గంటల్లో 66 ప్రశ్నలను అభ్యర్థులు సాధించమని అడిగారు. ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఇదేమీ కష్టం కాదు.

> 200 మార్కులకు పైగా సాధించిన అభ్యర్థికి ఐఐటీల్లోని ఇంజినీరింగ్ కోర్సుల్లో సీటు లభించే అవకాశం ఉంది. 300 మార్కులపైన స్కోర్ చేయగలిగితే 100లోపు ర్యాంకు వచ్చే అవకాశం ఉంది.

> తాము తల్చుకుంటే ఆబ్జెక్టివ్ టైపు ప్రశ్నలను కూడా అద్భుతంగా రూపొందించగలమని ఐఐటీ ప్రొఫెసర్లు నిరూపించారు. జ్ఞాపకశక్తికీ, వేగానికీ కాకుండా భావనలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.

### గణిత శాస్త్రం: ఏదీ సులువు కాదు

గణితశాస్త్రంలో ఊహించినట్టుగానే కలన గణితం (కాల్‌క్యులస్)కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే కాంప్లెక్స్ నంబర్స్, వెక్టర్స్ నుంచి కూడా మంచి ప్రశ్నలున్నాయి. రెండు లేదా ఎక్కువ భావనలనూ, పాఠ్యాంశాలనూ కలిపిన ప్రశ్నలు కూడా ఎన్నో ఉన్నాయి. ఏ ఒక్క ప్రశ్న కూడా సులువుగా లేదు. దేన్నీ ప్రామాణిక పుస్తకాల్లోంచి నేరుగా తీసుకోలేదు. మౌలిక సూత్రాలపై అవగాహన, విశ్లేషణ సామర్థ్యం, ప్రణాళికాబద్ధమైన సంసిద్ధత కలిగిన విద్యార్థులే ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు రాయగలుగుతారు.

కొన్ని ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకునేలా ఉన్నాయని కొందరు అభ్యర్థులు అంటున్నారు కానీ సరైన పద్ధతిని ఉపయోగిస్తే వాటిని సులువుగానే సాధించవచ్చు. గణితం పేపర్ కఠినంగా ఉండటం ఉత్తరాది అభ్యర్థుల కంటే మన రాష్ట్ర అభ్యర్థులకే లాభిస్తుంది.

### రసాయన శాస్త్రం: ఆర్గానిక్‌కు అనుకూలం

భావనలకు ప్రాధాన్యం ఇచ్చే ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. జ్ఞాపకశక్తి అవసరమైన ఇనార్గానిక్ నుంచి చాలా తక్కువ ప్రశ్నలు ఇచ్చారు. కాంప్రహెన్షన్ టైపు ప్రశ్నల్లో న్యూమరికల్ బేస్‌డ్ ప్రాబ్లమ్స్ ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి వచ్చాయి. రెట్రో సింథటిక్ ప్రాబ్లమ్స్ ఈసారి ఎక్కువ ఇచ్చారు. ఇనార్గానిక్‌లో రోడ్‌మ్యాప్ సమస్యలు ఇవ్వలేదు. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి నేరుగా ప్రశ్నలు వచ్చాయి. ఆర్గానిక్ కెమిస్ట్రీ మీద పట్టు ఉన్నవారికి పేపర్ అనుకూలంగా ఉంది.

### భౌతిక శాస్త్రం: మెకానిక్స్ హవా తగ్గింది

మెకానిక్స్‌కు గత సంవత్సరాల్లో పోలిస్తే తక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. మోడర్న్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎలక్ట్రిసిటీ పాఠ్యాంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్ అంటే మెకానిక్స్ మాత్రమే అనుకొని మిగతా పాఠ్యాంశాలను నిర్లక్ష్యం చేసిన అభ్యర్థులు మూల్యం చెల్లించాల్సివచ్చింది. ఏదేమైనా రెండేళ్ళు కష్టపడి చదివిన విద్యార్థులు ఆనందించేలాగా, ఏదో అవకాశం దొరికితే ఐఐటీల్లో సీటు కొట్టేద్దామనుకునే విద్యార్థులు నిరాశ చెందేలాగా జేఈఈ-2008 ఉంది.

### రేపటి అభ్యర్థుల సంగతి?

వచ్చే సంవత్సరం జేఈఈ రాయబోయే అభ్యర్థులు ఈ పేపర్‌లోని మొదటి సంవత్సరపు సిలబస్ ప్రశ్నలను సాధించాలి. ఆ విధంగా వారు తమ స్థాయిని అంచనా వేసుకోవచ్చు. ఫలితాన్ని బట్టి అవసరం అనుకుంటే ప్రిపరేషన్ పద్ధతిని మార్చుకోవాల్సివుంటుంది.

ఐఐటీ-జేఈఈ పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలోకి మారింది కాబట్టి ఏఐఈఈఈ, ఎంసెట్ మాదిరిగానే ఉంటుందనే భ్రమలో ఉన్న విద్యార్థులూ, ఇలాంటి భ్రమలు కల్పించే కొన్ని శిక్షణ సంస్థలూ ఈ ఏడాది పేపర్‌ను చూసి, గుణపాఠం నేర్చుకోవాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ బట్టీ పట్టటం వల్ల జేఈఈలో ర్యాంకు సాధ్యం కాదని రుజువు చేసేలా ఉంది ఈ ప్రశ్నపత్రం.